సాక్షి వరంగల్

బుధవారం | 2 | ఆగస్టు | 2023



కేంద్రం విపత్తు సాయం చేయాలి

జాతీయ విపత్తు కింద కేంద్ర ప్రభుత్వం రూ.ఐదువేల కోట్లు కేటాయించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. - 8లో▸



అంతా 'ఈజీ'మనీ రాదు - 8లో▸

సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథాను ఎంచుకుంటున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని కొత్త యాప్‌లతో గొలుసుకట్టు మోసాలకు పాల్పడుతున్నారు.

గరిష్టం/కనిష్టం
$30^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విజన్, మిషన్‌తో అభివృద్ధి సాధించాలి



కాళోజీ సెంటర్: ఉపాధ్యాయులు విజన్, మిషన్ ఏర్పాటు చేసుకొని పాఠశాలల అభివృద్ధి సాధించాలని సెక్టోరియల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ అన్నారు. జిల్లాలోని ఎంపిక చేసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నగరంలోని తాళ్ల పద్మావతి కళాశాలలో నిర్వహిస్తున్న శాలసిద్ధి శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫ్లోరెన్స్ హాజరై మాట్లాడారు. స్వీయ మూల్యాంకనం ద్వారా పాఠశాల అభివృద్ధికి ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు. ప్రతి అంశంలో పాఠశాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు సమాజ భాగస్వామ్యం, అధికారుల సహకారంతో అభివృద్ధి ప్రణాళికలు మెరుగుపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిని వెబ్ పోర్టల్‌లో నమోదు చేసి రాష్ట్ర స్థాయిలో జిల్లాకు గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు సుధీర్‌బాబు, బాబురావు, వేణుగోపాల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శాంతిని నెలకొల్పాలి

వరంగల్ లీగల్ : మణిపూర్‌లో హింసాకాండను అదుపు చేసి, శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్, భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) రాష్ట్ర కార్యదర్శి భీమనాథం శ్రీనివాస్ అన్నారు. ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి చిరంజీవి అధ్యక్షతన జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి కారణంగా మణిపూర్‌లో హింసా పెరిగిపోయిందని, అల్లర్లను అదుపు చేయడంలో విఫలమయ్యాయని పేర్కొన్నారు.

దుగ్గొండిలో నెమలి..



దుగ్గొండి: మండల కేంద్రంలోని బుడిగ జంగాల కాలనీలో మంగళవారం నెమలి కనిపించింది. గాయాలతో నెమలి కొట్టుమిట్టాడుతుండగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, వెంకటాపురం గ్రామానికి చెందిన మంద అనిల్ గమనించి దుగ్గొండి పోలీసులకు అప్పగించారు. వారు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా నెమలిని స్వాధీనం చేసుకుని చికిత్స అందించి, అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



నల్లబెల్లి: అధికారులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ఎమ్మెల్యే మంగళవారం సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సీనియర్ అసిస్టెంట్ అంజయ్యతో చర్చించారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. ఆయన వెంట జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, ఎంపీపీ ఊడుగుల సునిత, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

నలుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.శ్రీనివాస్ టాస్క్‌ఫోర్స్ నుంచి వర్ధన్నపేట, జి.బాబులాల్ వరంగల్ ట్రాఫిక్ నుంచి వీఆర్, పి.వెంకన్న వీఆర్ నుంచి వరంగల్ ట్రాఫిక్, కె.సూర్యప్రసాద్ వీఆర్ నుంచి సీసీఎస్‌కు బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

సివిల్స్ ఉచిత శిక్షణ

న్యూశాయంపేట: సివిల్స్ పరీక్షకు హాజరుకానున్న మైనారిటీ అభ్యర్థులకు తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఉమ్మడి జిల్లా కన్వీనర్, హనుమకొండ జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి మేన శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు www.cet.cgg.gov.in/tmreisలో ఈనెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 040-23236112 నంబర్‌లో సమర్పించాలని సూచించారు.

ఎక్కడి చెత్త అక్కడే..

నిలిచిపోయిన పారిశుద్ధ్య పనులు

- సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు
- మండల కేంద్రాల్లో దీక్షలు
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- ప్రభుత్వం నుంచి రాని సానుకూల స్పందన



గ్రామంలో పేరుకుపోయిన చెత్త

గీసుకొండ: సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ ఉద్యోగులు గత నెల 6 నుంచి సమ్మె చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. మురుగు కాల్వలు శుభ్రం చేయడం, చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించడం, వీధులను శుభ్రం చేయడం లాంటి పనులు చేసే వారు లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని సర్పంచ్‌లు వాపోతున్నారు. వరుసగా వర్షాలు కురుస్తుండటంతో వీధులు చిత్తడిగా మారుతున్నాయని పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి 27వ రోజుకు చేరింది. సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో సమ్మె కొనసాగిస్తామని కార్మికులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామాల్లో డెంగీ, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈఏడాది జిల్లాలో 59 డెంగీ కేసులు నమోదయ్యాయి. జూన్‌లో 12, జూలైలో 9 కేసులు, నాలుగు మలేరియా కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. పలు గ్రామాల్లో సర్పంచ్‌లు కొంత మేరకు చొరవ తీసుకుని ప్రైవేట్‌గా కూలీలతో పనులు చేయిస్తున్నారు. ఇటీవల నాలుగు రోజులపాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టి చెత్తాచెదారం లేకుండా, మురుగు కాల్వలను శుభ్రం చేశారు. అనుభవం లేని కూలీలు సరిగా పనిచేయడం లేదని తెలుస్తోంది.

పంచాయతీ కార్మికుల డిమాండ్లు ఇవి..

జిల్లాలోని 13 మండలాల్లో 323 గ్రామాలు ఉన్నాయి. ప్రతీ గ్రామంలో కారోబార్, ఎలక్ట్రీషియన్, పంపు ఆపరేటర్, ట్రాక్టర్ డ్రైవర్, అటెండర్లు, పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. ఈ పనులు చేసే వారంతా జిల్లాలో సుమారు 1,680 మంది ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతూ, స్థానిక పాలన సజావుగా జరిగేలా పనులు చేస్తూ, చాలీచాలని వేతనాలతో వారు జీవనం గడుపుతున్నారు.

నెలనెలా సకాలంలో జీతాలు అందించాలని, మల్టీపర్పస్ వర్కర్ల విధానం వద్దని, 8 గంటల పని విధానం కావాలని, రూ.పది లక్షల బీమా సదుపాయం కల్పించాలని తదితర 17 సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. జీఓ 60 ప్రకారం జీతాలు ఇవ్వాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. పీఆర్సీలో నిర్ణయించిన మేరకు నెలకు రూ.19 వేల కనీస వేతనం ఇవ్వాలని, అప్పటి దాకా స్వీపర్లకు రూ.15,800, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500 ఇవ్వాలని కోరుతున్నారు.

దశల వారీగా సమ్మె ఉధృతం

పంచాయతీ ఉద్యోగులు దశల వారీగా తమ సమ్మెను ఉధృతం చేస్తున్నారు. అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చింది మొదలు ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట దీక్షలు చేస్తున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ (సీఐటీయూ, ఏఐటీయూసీ, టీజీకేబీయూ, ఐఎఫ్‌టీయూతో కూడిన)గా ఏర్పడి ఉద్యమిస్తున్నారు. గ్రామాల్లో చేసే అత్యవసర సేవలు మినహా మిగతా వాటిని చేయడం ఆపేశారు. ఎమ్మెల్యేల ఇంటి వద్ద ధర్నాలు చేశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో ఇటీవల హైదరాబాద్‌లో జేఏసీ ప్రతినిధులు జరిపిన చర్చలు విఫలం కావడంతో సమ్మె కొనసాగిస్తున్నారు.

ఆందోళనలు ఉధృతం చేస్తాం..



ప్రభుత్వం మా సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలి. లేదంటే ఆందోళనలను ఉధృతం చేస్తాం. సమస్య పరిష్కరించేవరకు సమ్మె విరమించం.

- ఎండీ.అలీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు

ఇంటింటా ఇన్నోవేటర్

- రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో పోటీలు
- వినూత్న ఆవిష్కరణలకు అవకాశం
- ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావచ్చు
- ఆవిష్కరణలను పంపడానికి ఈనెల 5వ తేదీ వరకు గడువు



గత ఏడాది ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారితో విద్యార్థిని (ఫైల్)

కాళోజీ సెంటర్: ప్రజల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారి మేధస్సుకు పదును పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని ఔత్సాహిక యువ శాస్త్రవేత్తలు, విద్యార్థులు, గ్రామీణ, పట్టణ ఆవిష్కరణలు, స్టార్టప్, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల రంగాలకు సంబంధించి ఆవిష్కరణలకు ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమం దోహదపడనుంది. గత ఐదేళ్లుగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమం రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఇన్నోవేషన్ ప్రదర్శనలకు ఆగస్టు 15స్వాతంత్య్ర దినోత్సవం రోజున అవకాశం కలిపించనున్నారు. ఆసక్తి గలవారు తమ ఆవిష్కరణకు సంబంధించి రెండు నిమిషాల వ్యవధిలో రూపొందించిన వీడియో, ఆవిష్కరణకు సంబంధించి నాలుగు ఫొటోలు, ఆరు పంక్తుల్లో ఆవిష్కరణ వివరాలు, వ్యక్తి పేరు, వయస్సు, ప్రస్తుతం చేస్తున్న వృత్తి, మొబైల్ నంబర్, జిల్లా, మండలం, గ్రామం పేరుతో కూడిన వివరాలు వాట్సాప్ నంబర్ 91006 78543కు ఈనెల 5వ తేదీ లోగా పంపాలి. మరింత సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ ఫోన్ నంబర్ 98488 78455 ద్వారా కూడా సంప్రదించవచ్చు.

ప్రతిభ కనబర్చిన వారికి ప్రోత్సాహం

గత సంవత్సరం నిర్వహించిన ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమానికి జిల్లా నుంచి విశేష స్పందన వచ్చింది. పరకాల గ్రామానికి చెందిన మహిపాల్ చారి వ్యవసాయ పనులు, గడ్డికట్టలు, వడ్ల బస్తాల పనులు సులభంగా చేసే యంత్రాలను తయారు చేసి గుర్తింపు పొందారు. నర్సంపేటకు చెందిన నిమ్మనబోయిన మొగిలి 100 మునగ కాడలను ఒకే సారి కట్టింగ్ చేయడానికి ఉపయోగపడే యంత్రాన్ని తయారు చేసి ప్రదర్శించారు. రాయపర్తి మండలం పెరికవేడు గ్రామానికి చెందిన వెనిశెట్టి కృష్ణమూర్తి మురుగు తొట్టి శుభ్రం చేయడానికి కావాల్సిన కొత్త విధానాన్ని తక్కువ ఖర్చుతో రూపొందించారు. వీరికి ఆగస్టు 15న జరిగిన స్వాతంత్య్ర దినోత్సం సందర్భంగా ప్రశంస పత్రం అందజేసి సత్కరించారు. జిల్లాలో ఉత్తమ ప్రదర్శనను రాష్ట్ర స్థాయిలో జరిగే ప్రదర్శనకు ఎంపిక చేస్తారు. అక్కడ ఎంపికైన వారికి ప్రోత్సాహకం అందజేసి స్వంత పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించే అవకాశం ఉంది.

అందరూ భాగస్వాములు కావాలి

రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలో అందరూ భాగస్వాములు కావాలి. సృజనాత్మకత, ప్రతిభ గల వారు వారి మేధస్సుకు పదును పెట్టేందుకు ఇదొక చక్కటి అవకాశం.

- డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి

రూ.30లక్షలతో అభివృద్ధి.. 40మంది విద్యార్థులేనా..

- అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్ ప్రావీణ్య
- అడవిరంగాపురంలో మన ఊరు.. మనబడి పనుల పరిశీలన



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

దుగ్గొండి: ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం లక్షల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తుందని అందుకు తగ్గట్టుగా విద్యార్థుల సంఖ్యను పెంచాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మండలంలోని అడవిరంగాపురంలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో రూ.30లక్షలతో అభివృద్ధి పనులు చేస్తే కేవలం 40 మంది విద్యార్థులే ఉండడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు సమష్టిగా విద్యార్థుల సంఖ్యను పెంచాలని తెలిపారు. వంటల గది, మంచినీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అన్ని వసతులు ఉన్న పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉండడం బాధాకరమన్నారు. గ్రామంలో ఎంత మంది ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారో తెలుసుకుని వారిని ప్రభుత్వ బడిలో చేర్పించే విధంగా కృషి చేయాలని హెచ్ఎం కనకయ్యను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. అదనపు నిధుల కోసం సర్పంచ్ రమాదేవి విన్నవించగా కలెక్టర్ సాకుకూలంగా స్పందించారు.

గ్రామ నర్సరీని పరిశీలించి ఎన్ని రకాల మొక్కలు పెంచారు. ఎన్ని నాటారు అనే వివరాలపై ఆరాతీశారు. అనంతరం అడవిరంగాపురం పెద్ద చెరువులో సర్వే నంబర్ 8లో తమకు చెందిన 80 ఎకరాల పట్టాభూములు ఉన్నాయని వాటికి పట్టాలు ఇవ్వకుండా ఆపివేశారని రైతుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ చెరువును పరిశీలించారు. నీరు ఎంత వరకు ఉంది. ఇంకా ఎంత శిఖం ఉంది.. అనే వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డీఈఓ వాసంతి, ఆర్‌డీఓ కృష్ణవేణి, డీపీఓ కల్పన, ఎంపీపీ కాట్ల కోమల, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణప్రసాద్, ఎంపీఓ శ్రీధర్, సర్పంచ్ రమాదేవి, ఎంపీటీసీ పిండి కుమారస్వామి, డీఈలు ఇజ్జగిరి, రామకృష్ణ, రమాదేవి, ఏఈలు వెంకటేశ్వర్లు, రజినీకాంత్ ఉన్నారు.

రుణమాఫీ చేశాకే ఓట్లు అడుగుతాం..

- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్ రెడ్డి

నల్లబెల్లి: రైతులకు రూ.లక్ష లోపు రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేశాకే రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రజల వద్దకు ఓట్ల కోసం వస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మందుగా గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలతో ప్రజల సమస్యలపై చర్చించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందని, అర్హులైన వారికి గృహలక్ష్మి, దళిత బంధు, రెండో విడత గొర్రెల పంపిణీ, బీసీ, మైనార్టీలకు రూ.లక్ష రుణాలతోపాటు పలు ప్రభుత్వ పథకాల్లో మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం నియోజకవర్గంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీనిచ్చారు. త్వరలోనే భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున రూ.37.50 కోట్ల పంట నష్టపరిహారాన్ని అందిస్తామన్నారు. 1,000 మంది దళితులకు 70 శాతం సబ్సిడీతో రెండు బర్రెలను పంపిణీ చేస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు ఐక్యతతో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, ఎంపీపీ సునిత, ప్రవీణ్ గౌడ్, మురళీధర్, సారంగపాణి, శ్రీనివాస్ గౌడ్, నల్లబెల్లి అధ్యక్షుడు క్యాతం శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

'బోయినపల్లి' ఇంట్లో బీఆర్ఎస్ నేతల భేటీ!

- పార్టీ కార్యక్రమాలు, అభ్యర్థుల గెలుపుపై చర్చ
- అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్న వినోద్‌కుమార్
- సుమారు రెండు గంటలకు పైగా జరిగిన సమావేశం



బోయినపల్లి వినోద్‌కుమార్ ఇంట్లో సమావేశమైన ఎమ్మెల్యే అరూరి రమేష్, నాగుర్ల వెంకన్న, మార్నేని రవీందర్‌రావు తదితర నేతలు

సాక్షిప్రతినిధి, వరంగల్: బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ ముఖ్యనేతలు మంగళవారం రాత్రి హనుమకొండలోని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి కుమార్ ఇంట్లో సమావేశం అయ్యారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్, రాష్ట్ర రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, రైతుబంధు సమితి హనుమకొండ కో-ఆర్డినేటర్ ఎల్లావుల లలితా యాదవ్, ఉద్యమకారుడు, కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్ రావు, ఆత్మ జిల్లా చైర్మన్ చంద్రమోహన్, పీఏసీఎస్ చైర్మన్ ఉదయ రెడ్డి, జోరిక రమేష్ తదితరులు పాల్గొన్నారు. జూలై 17న వర్ధన్నపేట నియోజకవర్గంలో నేతల మధ్య పొడచూపిన అంతర్గత విభేధాలపై కథనాలు వెలువడ్డాయి. కొందరు నేతలు.. బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావులను కలిసి ఎమ్మెల్యే రమేష్‌పై అసంతృప్తిని వ్యక్తం చేశారన్న ప్రచారం జరిగింది. ఇదే సమయంలో జూలై 25న రెండు రోజులుగా వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌పై అసమ్మతి ఉందని తమపై దుష్ప్రచారం చేశారని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మరికొందరు నేతలు హనుమకొండలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. అనంతరం ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ ఇంట్లో ఆయన సమక్షంలో భేటీ అయిన నాయకులు సుమారు రెండు గంటలకుపైగా పలు అంశాలపై మాట్లాడారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని, ఈ సందర్భంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ప్రజాప్రతినిధులు, నాయకులకు సూచించినట్లు వినోద్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. సమావేశంలో ఇంకా పోలెపల్లి రామ్మూర్తి, మార్కెట్ డైరెక్టర్, రతన్ రావు, యుగెంధర్‌రావు, మాజీ జెడ్పీటీసీ సారంగపాణి, బుద్దె వెంకన్న, రాజశేఖర్, కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయాలి

ఖానాపురం: రాష్ట్రంలోని ఉపాధ్యాయ ఉద్యోగులకు సంబంధించిన మొదటి వేతన సవరణ కమిషన్ గడువు ముగిసినందున రెండో వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అటుకుల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో డీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి వేతన సవరణ కమిషన్ సిఫార్సుల అమలులో జాప్యం కారణంగా ఉద్యోగులు రూ.లక్షల్లో నష్టపోయారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. విద్యారంగంలో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 33జిల్లాలకుగాను 21జిల్లాలకు రెగ్యూలర్ డీఈఓ పోస్టులు మంజూరు చేయలేదని, 610మండలాలకు కేవలం 14మంది మాత్రమే రెగ్యూలర్ ఎంఈఓలు ఉన్నారని తెలిపారు. 7,136స్కూల్ అసిస్టెంట్, 1,967 గెజిటెడ్ హెచ్ఎం, 8,185ఎస్‌జీటీ పోస్టులతోపాటు అనేక ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇన్ని ఖాళీలతో విద్యా వ్యవస్థ ఎలా ముందుకు పోతుందని ప్రశ్నించారు. అక్టోబర్‌లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించే డీటీఎఫ్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య, హెచ్ఎం రాజేందర్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు కొర్ర రమేష్, ప్రధాన కార్యదర్శి జగన్, తదితరులు పాల్గొన్నారు.

192 గ్రామాల్లో నష్టం

- ఇంకా తేరుకోని జిల్లా ప్రజలు
- కేంద్ర బృందానికి వివరించిన కలెక్టర్ ప్రావీణ్య



కేంద్ర బృందంతో సమావేశమైన కలెక్టర్ ప్రావీణ్య, పక్కన హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్

హన్మకొండ అర్బన్/కరీమాబాద్: భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లా వ్యాప్తంగా 192గ్రామాల్లో నష్టం వాటిల్లినట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. జిల్లాలో ఈసీజన్‌లో 843 మి.మీ. వర్షపాతం నమోదైందని చెప్పారు. ఒకరు చనిపోయినట్లు తెలిపారు. భారీ వర్షాలకు జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు మంగళవారం జిల్లాకు వచ్చిన కేంద్ర బృందం సభ్యులతో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. ముందుగా బృందం సభ్యులు వరద ప్రభావిత ప్రాంతాలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నగరంలో వర్షాలు, వరదలతో జరిగిన నష్టాన్ని కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ వివరించారు.

నగరంలో దెబ్బతిన్న 150.61 కిలోమీటర్ల సీసీ రోడ్లు

వరంగల్ మహానగరంలో వరదల వల్ల 150.61 కిలోమీటర్ల సీసీ రోడ్డు దెబ్బతిందని, దీంతో రూ.110.71 కోట్ల నష్టం వాటిల్లిందని గ్రేటర్ కమిషనర్ షేక్‌రిజ్వాన్‌బాషా వివరించారు. 82.73కిలోమీటర్ల బీటీ రోడ్డుకు రూ.92.94 కోట్లు, 84.56 కిలోమీటర్ల మెటల్ రోడ్డుకు రూ.43.55 కోట్లు, 75.23 కిలోమీటర్ల గ్రావెల్ రోడ్లకు రూ.9.37కోట్లు, 71 కల్వర్టులకు రూ.53.41 కోట్లు, 41.3 కిలోమీటర్ల మంచినీటి సరఫరా పైపులైన్లకు రూ.25 కోట్ల మేర నష్టం జరిగిందని ఆయన తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 535 ఫిర్యాదులు స్వీకరించామని, 5 రెస్పాన్స్ టీంల ద్వారా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. నగరంలో 199 కాలనీలు పాక్షికంగా నీటిలో మునగగా క్లియర్ చేసినట్లు చెప్పారు. అలాగే, వర్షాలకు పడిపోయిన 32 వృక్షాలను సిబ్బంది తొలగించారన్నారు. గ్రేటర్ జీడబ్ల్యూఎంసీ ద్వారా 27 ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి దాదాపు 3,500 మందిని తరలించి సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. అనంతరం కేంద్ర బృందం సభ్యులు కలెక్టర్లు, కమిషనర్, అధికారులతో కలిసి జవహర్‌నగర్, పోతననగర్ ప్రాంతంలోని భద్రకాళి చెరువుకు పడిన గండి, బొంది వాగు ప్రాంతాన్ని సందర్శించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు ఎన్‌డీఎంఏ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి (టీం లీడర్), డిప్యూటీ సెక్రటరీ అనిల్ గైరోల, రీజినల్ ఆఫీసర్‌కుష్వా, మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి డైరెక్టర్ రమేష్‌కుమార్, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ పూను స్వామి, హైదరాబాద్ ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ శ్రీనివాసులు, పవర్ భవ్య పాండే, అదనపు కలెక్టర్ మహేందర్, ఆర్డీఓ రమేష్‌కుమార్, సీపీఓ సత్యనారాయణరెడ్డి, నీటి పారుదల శాఖ, మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాయపర్తి మండలంలో ఊకల్, కొండాపురం రోడ్డును పరిశీలిస్తున్న కేంద్రబృందం, కలెక్టర్

కొట్టుకుపోయిన రోడ్ల పరిశీలన

రాయపర్తి: భారీ వర్షాల కారణంగా మండలంలోని ఊకల్, కొండాపురం గ్రామాల మధ్యన కొట్టుకుపోయిన రహదారిని కేంద్రబృందం, కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం సాయంత్రం పరిశీలిచారు. ఈ సందర్భంగా వరద కారణంగా రహదారితోపాటు, వరి పొలాలు కొట్టుకుపోయిన పరిస్థితులను రైతులను, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఏడుగురు సభ్యుల కేంద్రబృందం జిల్లాలో వరద నష్టాలు, సహాయక చర్యలను అంచనా వేయడంతోపాటు కేంద్ర సహాయాన్ని ఆమోదించడానికి తుది సిఫారసుకు జిల్లాలో పర్యటించినట్లు ఎన్‌డీఎంఏ జాయింట్ సెక్రటరీ కునాల్ ప్రత్యార్థి తెలిపారు.

ఆహ్వానం

పర్వతగిరి: ఈనెల 15న ఢిల్లీలో జరగనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలో పాల్గొనేందుకు మండలంలోని మంక్యావాల్యతండా చెరువు కుంట నిర్మాణంలో పాల్గొన్న కూలీలకు ఆహ్వానం అందనుందని ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ కుంట నిర్మాణం, రైతులకు ప్రయోజనాలను మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ వివరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మంక్యావాల్యతండాలో కుంట నిర్మాణంలో పనిచేసిన ఉపాధి హామీ కూలీల జాబితాను కేంద్ర ప్రభుత్వం అడిగినట్లు ఎంపీడీఓ చెప్పారు. మరో మూడ్రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

'అమృత్ భారత్'కు కాజీపేట జంక్షన్ ఎంపిక



కాజీపేట రూరల్ : అమృత్ భారత్ పథకానికి కాజీపేట జంక్షన్ ఎంపికైనట్లు రైల్వే అధికారులు మంగళవారం రాత్రి తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో 16 రైల్వే స్టేషన్లు ఈ పథకానికి ఎంపిక కాగా వాటిలో కాజీపేట జంక్షన్ ఉండటం విశేషం. అమృత్ భారత్ పథకానికి ఎంపికైన రైల్వే స్టేషన్లను అన్ని హంగులతో ఆధునీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 6న ప్రధాని నరేంద్రమోదీ, రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ చేతుల మీదుగా వర్చువల్‌లో ఫౌండేషన్ స్టోన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. అదేరోజు ఆయా రైల్వే స్టేషన్లలో అధికారులు ఆన్‌లైన్ ఫౌండేషన్ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ముందస్తు ఏర్పాట్ల కోసం బుధవారం కాజీపేట జంక్షన్‌కు సికింద్రాబాద్ డివిజన్ నుంచి రైల్వే అధికారుల బృందం రానున్నట్లు వివరించారు. స్థానిక అధికారులతో చర్చించి శంకుస్థాపనకు కావాల్సిన ఏర్పాట్లు చేయనున్నట్లు వారు తెలిపారు. అమృత్ భారత్ పథకంతో కాజీపేట రైల్వే జంక్షన్ స్వరూపం మారనున్నట్లు పేర్కొన్నారు.

ఎంపికైన రైల్వే స్టేషన్లు

హైదరాబాద్, కాజీపేట, యాదాద్రి, జనగామ, అఫీస్‌పేట, హైటెక్‌సిటీ, బీదర్, జహీరాబాద్, పర్లీ, తాండూరు, మహబూబాబాద్, భద్రాచలం, మధిర, ఖమ్మం, రామగుండం, కరీంనగర్ రైల్వే స్టేషన్లు అమృత్ భారత్ పథకానికి ఎంపికైనట్లు రైల్వే అధికారులు తెలిపారు.

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అప్రమత్తం

కాజీపేట రూరల్ : జైపూర్–ముంబాయి ఎక్స్‌ప్రెస్ రైలులో జరిగిన ఘటనతో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులను అప్రమత్తం చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లలో సిబ్బంది అలర్ట్‌గా ఉన్నారని వారు పేర్కొన్నారు.


రూ.లక్ష సాయానికి దరఖాస్తు చేసుకోవాలి

న్యూశాయంపేట : రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 100 శాతం సబ్సిడీతో లక్ష రూపాయల ఆర్థిక సాయం కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల మైనారిటీ సంక్షేమాధికారులు కె.విక్రమ్‌కుమార్, మేన శ్రీను మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 14లోగా దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఆయా జిల్లాల మైనారిటీ సంక్షేమాధికారుల కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

ఈ యాప్‌లతో అంతా 'ఈజీ'మనీ రాదు

ఇప్పటికే జాన్సన్ అండ్ జాన్సన్స్ ఉత్పత్తులను చూపి రూ.కోట్లు లూటీ

- ఇప్పుడూ అదే తరహా డీజేఐ పేరుతో మరో యాప్ లింక్ చక్కర్లు
- డ్రోన్లు, వీడియో కెమెరాలు, సెల్‌ఫోన్ల ఫొటోలతో అదిరిపోయే ఆఫర్లు
- రోజు ఆదాయం వస్తుందని... నెలల్లోనే రూ.లక్షాధికారి అంటూ వల
- సైబర్ నేరగాళ్లు సృష్టించే ఈ యాప్‌లపై జాగ్రత్తగా ఉంటేనే మంచిది
- సైబర్ నేరగాళ్లు వన్డే సిరీస్ ఆడేశారు' 'సాక్షి' కథనంపై సీపీ రంగనాథ్ ఆరా
- బాధితుల ద్వారా వివరాలు సేకరించి విచారణ చేపట్టాలని సైబర్ విభాగానికి ఆదేశం



'సాక్షి' కథనంపై సీపీ ఆరా...

'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన సైబర్ నేరగాళ్ల 'వన్‌డే' సిరీస్ ఆడేశారు అనే కథనంపై వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ. రంగనాథ్ దృష్టి సారించారు. ఆ యాప్ బాధితుల నుంచి వివరాలు సేకరించి సమగ్ర దర్యాప్తు చేయాలని సైబర్ విభాగాన్ని ఆదేశించడంతో ఈ మేరకు విచారణ చేపట్టారు. ఇదిలావుండగానే ఇప్పుడూ అదే తరహాలో సైబర్ నేరగాళ్లు డీజేఐ కంపెనీ పేరుతో సృష్టించిన మరో యాప్ చక్కర్లు కొడుతోంది. దీనివల్ల కూడా ఎవరైనా మోసపోయి ఉంటే ముందుకొచ్చి ఫిర్యాదు ఇస్తే విచారణ చేస్తామని సీపీ రంగనాథ్ అన్నారు. ఈజీమనీ అంటే అనుమానించాలన్నారు. అదిరిపోయే ఆఫర్లకు ఆకర్షితులు కావొద్దని, అప్రమత్తతో వీటికి దూరంగా ఉండాలని కోరారు.

సాక్షి, వరంగల్: జనాలను ఈజీమనీకి అలవాటు చేస్తూ అందినకాడికి దండుకునేందుకు నకిలీ మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం) యాప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం జాన్సన్ అండ్ జాన్సన్స్ కంపెనీ పేరుతో పాటు ఆ ఉత్పత్తులతో రూ.కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లు.. అదే ఆలోచనతో ఇప్పుడూ డ్రోన్ల ఉత్పాదకతతో పాటు విక్రయాల్లో మంచి పేరున్న డీజేఐ కంపెనీ పేరుతోనూ గొలుసుకట్టు దందాకు తెరలేపారు. డ్రోన్లు, బ్యాటరీ చార్జర్లు, రిమోట్ కంట్రోల్ ఫోల్డబుల్ ఆర్‌సీ క్వాడ్‌కాప్టర్ డ్రోన్లు, సెల్‌ఫోన్లు తదితర ఉత్పత్తులపై పెట్టుబడి పెడితే మూడింతల డబ్బులు వస్తాయంటూ ఆశచూపుతున్నారు. రోజువారీగా ఆదాయం నిర్ణయించి...50 రోజుల్లో త్రిబుల్ ధమాకా ఉంటుందని అంకెల గారడీ చేస్తున్నారు. ఇప్పటికే జాన్సన్ అండ్ జాన్సన్స్ కంపెనీ పేరుతో వందలాది మందిని మోసగించిన ఈ సైబర్ నేరగాళ్ల ముఠా...ఇప్పుడూ అదే తరహాలో డీజేఐ కంపెనీ పేరుతో డీజేఐఓఎఫ్ఎఫ్.కోటైహెచ్5టై అనే లింక్ ద్వారా యాప్‌లో అదిరిపోయే ఆఫర్లతో కట్టి పడేస్తున్నాయి. సేమ్ టూ సేమ్...అదే తరహాలో ఇన్విటేషన్ లింక్‌లు పంపిస్తే అదనపు డబ్బు వస్తుందంటూనే...అనేక మందితో పెట్టుబడులు పెట్టించాలని చూస్తున్నారు. వీటిపట్ల జాగ్రత్తగా ఉండకపోతే మనకు లాభాలు రావడం దేవుడెరుగు...మన మనీ కాస్తా రావడం కష్టమనే అభిప్రాయముంది.

డీజేఐ పేరుతో ఎలా వల విసురుతున్నారంటే...

జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ పేరుతో యాప్‌లో డబ్బులు పెట్టి మోసపోయినవారు...అదే విధానంతో ఉన్న కొత్త యాప్ డీజేఐ యాప్‌లో పెట్టుబడులు పెడితే మీరు మోసపోయిన డబ్బుల కన్నా ఎక్కువగా సంపాదించొచ్చనే మెసేజ్ బాధితుల వాట్సాప్ గ్రూప్‌ల్లో వైరల్ అయింది. ఈ యాప్‌లో టీకే ప్రొడక్ట్స్ పేరుతో ఆరు ఉత్పత్తులను డిస్‌ప్లే చేస్తున్నారు. అతి తక్కువగా రూ.700తో ఆశ చూపి 50 రోజుల్లో రూ.2,100 వస్తుందని, ఆపై అతి ఎక్కువగా రూ.75,800 ప్రొడక్ట్‌పై పెడితే 55 రోజుల్లో రూ.3,12,675 వస్తుందని ఆశచూపి మభ్యపెడుతున్నారు.

ఆఫర్లు ఎలా అంటే...

- టీకే 700 పేరుతో సెల్‌ఫోన్‌ను రూ.700గా నిర్ణయించారు. రోజువారీగా ఆదాయం రూ.42 అంటే మొత్తంగా 50 రోజుల్లో రూ.2100 వస్తుందని ప్రాజెక్ట్ చేశారు. అదే రోజున ఐదుగురిని చేర్పిస్తే రూ.150, రూ.200, రూ.250, రూ.300, రూ.350తో పాటు 12 శాతం కమిషన్ కింద రూ.252, ఆరుశాతం కమిషన్ కింద రూ.126, మూడు శాతం కమిషన్ కింద రూ.63 వస్తుందని ఉచ్చులో పడేస్తున్నారు. కేవలం ఐదుగురికి ఇన్విటేషన్ పంపడం ద్వారానే రూ.1250తో పాటు కమిషన్ కింద రూ.63 నుంచి రూ.252 వరకు వస్తుందని ఆశలు రేపుతున్నారు.
- టీకే 5800 పేరుతో మరో సెల్‌ఫోన్‌ను రూ.5,800లుగా నిర్ణయించి రోజువారీగా ఆదాయం రూ.364.40గా 51 రోజుల్లో రూ.18,635.40 వస్తుందని యాప్‌లో నిక్షిప్తం చేశారు. అలాగే ఇన్విటేషన్ లింక్‌ల ద్వారా ఒకరి నుంచి ఐదుగురి వరకు చేర్పిస్తే రూ.250, రూ.300, రూ.350, రూ.400, రూ.450 ఇస్తామంటున్నారు. కమిషన్ రూపంలో రూ.559 నుంచి రూ.2236 వరకు వస్తుందని లైన్‌లోకి తెస్తున్నారు.
- టీకే 45,800లుగా డ్రోన్ ధర నిర్ణయించి రోజుకు రూ.3297.60గా 54 రోజుల్లో రూ.1,78,070.40 వస్తుందని నిర్ణయించారు. ఐదుగురు వరకు ఇన్విటేషన్ లింక్ ద్వారా చేర్పిస్తే రూ.550 నుంచి రూ.750 వరకు వస్తుందని, అదే సమయంలో కమిషన్ ద్వారా రూ.5342 నుంచి రూ.21,368 వరకు వస్తుందని ఆశచూపుతున్నారు.
- టీకే 75,800లుగా డ్రోన్ ధర నిర్ణయించి రోజు రూ.5,685 ఆదాయం వస్తుందని 55 రోజుల్లో రూ.3,12,675 వస్తుందని ప్రాజెక్ట్ చేస్తున్నారు. ఐదుగురి వరకు లింక్‌ల ద్వారా చేర్పిస్తే రూ.650 నుంచి రూ.850 వరకు వస్తుందని, కమిషన్ల ద్వారా రూ.9,380 నుంచి రూ.37,521 వరకు డబ్బులు వస్తాయని మభ్యపెడుతున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



చందర్(ఫైల్)

కేసముద్రం: క్షణికావేశంలో పురుగులమందు తాగిన ఓ యువకుడు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని కేసముద్రంవిలేజ్‌లో జరిగింది. ఏఎస్సై కృష్ణమూర్తి కథనం ప్రకారం గ్రామానికి చెందిన అనుమల రమేష్, మల్లేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్నకుమారుడు చందర్(20) హైదరాబాద్‌లో టాటా ఏస్ వాహనం నడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల వాహనం విక్రయించారు. వాహనం విక్రయించగా వచ్చిన డబ్బులో రూ.15వేలు చందర్ ఖర్చు చేయడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన చందర్.. గత నెల 30న పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్నేహితులు గుర్తించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు చందర్‌ను మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..



ప్రభాకర్(ఫైల్)

కేసముద్రం: బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లిన కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఆలకుంట్ల సారయ్య, సూరమ్మ దంపతులకు ఒక కుమారుడు ప్రభాకర్(35) ఉన్నాడు. ప్రభాకర్‌కు 6ఏళ్ల క్రితం తొర్రూరు మండలానికి చెందిన సంధ్యతో వివాహం జరిగింది. ఆ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లిన ప్రభాకర్ చిలుకూరి బాలాజీ టెంపుల్ సమీపంలో భార్యా, పిల్లలతో ఉంటూ కారు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రోజుమాదిరిగానే ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంట్లో విద్యుత్ తీగ ఫెయిలై ఇనుప కిటికీ మీద పడడంతో విద్యుత్‌సరఫరా అవుతోంది. ఈ తీగను పట్టుకున్న ప్రభాకర్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కాగా, బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లిన ప్రభాకర్ మృతి చెందారనే విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

పాపం పండింది..

- వివాహిత హత్య కేసులో నిందితుల అరెస్ట్
- భర్త, అత్తతో పాటు మరో నలుగురిపై కేసు
- వివరాలు వెల్లడించిన కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఎస్సై అభినవ్

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఒడిపిలవంచలో సోమవారం జరిగిన వివాహిత హత్య కేసులో భర్త చిగురు గణేష్, మృతురాలి అత్త చిగురు కమలమ్మను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు కాటారం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఒడిపిలవంచకు చెందిన గణేష్‌కు కాటారం మండల కేంద్రానికి చెందిన సంధ్యతో 2017లో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.5లక్షలతో పాటు పది తులాల బంగారం కట్నంగా ముట్టజెప్పారు. అనంతరం కొన్ని రోజుల నుంచి దంపతుల మధ్య వివాదాలు నెలకొనగా పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీ నిర్వహించి సయోధ్య కుదిర్చారు. ఈ క్రమంలో గణేష్ ఫర్టిలైజర్ వ్యాపారం, మరో వ్యాపారం చేయడానికి డబ్బు అవసరం వచ్చింది. దీంతో తల్లి కమలమ్మతో పాటు కుటుంబ సభ్యుల ప్రోద్బలంతో అదనపు కట్నం తీసుకురావాలని భార్య సంధ్యపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో పలుమార్లు సంధ్య తన తల్లిదండ్రులతో చెప్పి డబ్బులు ఇప్పించింది. అయినా గణేష్ సంతృప్తి చెందక మరిన్ని డబ్బులు తీసుకురావాలని ఆదివారం రాత్రి భార్యతో గొడవపడి కర్ర, రోకలితో తీవ్రంగా కొట్టాడు. సంధ్య అపస్మారక స్థితిలోకి వెళ్లగా మృతి చెందలేదని నిర్ణయించుకుని ఇంటి ఎదుట బండకు తలను బాదడంతో ఆమె మృతిచెందింది. సంధ్య కాలుజారి పడి మృతిచెందినట్లు చిత్రీకరించడానికి గణేష్ ప్రయత్నించినా ఫలించలేదు. హత్యకు పాల్పడిన గణేష్, అదనపు కట్నం కోసం వేధింపులకు ప్రోత్సహించిన గణేష్ తల్లి కమలమ్మ, మరో నలుగురు కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై అభినవ్, ప్రొబేషనరీ ఎస్సై ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



తిమ్మాపురంలో పత్తి పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

మామునూరు: వర్షాకాలం పత్తి పంటలో సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మామునూరు కేవీకే శాస్త్రవేత్త రాజు సూచించారు. ఈమేరకు మంగళవారం ఖిలా వరంగల్ మండల పరిధి తిమ్మాపురం, సింగారం, మామునూరు గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పత్తి పంటలను క్షుణ్ణంగా పరిశీలించింది. అనంతరం శాస్త్రవేత్త రాజు మాట్లాడుతూ వర్షాల ఉధృతి తగ్గిన వెంటనే చీడ పీడల ఉధృతి పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఆ సమయంలో వేప నూనె పిచికారీ తగ్గించి రసాయనిక పురుగు మందులను పిచికారీ చేయాలన్నారు. తక్కువగా ఉంటే వేప నూనెను పిచికారీ చేయాలని పేర్కొన్నారు. అధిక వర్షాలకు ఎరుపు రంగులోని మారిన పత్తి పంటపై 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 19.19.19 10 గ్రాముల లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అదేవిధంగా పంట ఎదుగుదలను పెంచడానికి వర్షాలు తగ్గిన వెంటనే 25 కిలోల యూరియా, 10కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు ఐదు సెంటీ మీటర్ల దూరంలో వేసుకోవాలని సూచించారు. అధిక తేమకు పత్తి మొక్కలకు వేరు కుళ్లు తెగ సోకడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందని, దీని నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, ఒక గ్రామ్ కార్బండజిమ్ లీటర్ నీటికి కలిపి ఆ ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల పాదుల చుట్టూ వారం వ్యవధిలో రెండుసార్లు పోయాలని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, డాక్టర్ గణేష్ , పత్తి రైతులు పాల్గొన్నారు.

కేంద్రం విపత్తు సాయం చేయాలి

- రూ. ఐదువేల కోట్లు కేటాయించాలి
- యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

న్యూశాయంపేట: జాతీయ విపత్తు కింద కేంద్ర ప్రభుత్వం రూ. ఐదువేల కోట్లు కేటాయించాలని, ముంపుప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం హనుమకొండలోని పలు వర్ష ప్రభావిత ప్రాంతాల్లో నాయకులతో కలిసి పర్యటించారు. అనంతరం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించి వెళ్లారని, ఇది సరిపోదని కేంద్ర నుంచి ఆర్థిక సాయం అందేలా కృషిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ. ఐదు వందల కోట్లు కేటాయించడం కంటితుడుపు చర్యగా అభివర్ణించారు. వరంగల్, హనుమకొండ పట్టణాల్లో నాలాలు కబ్జాలకు గురయ్యాయని, చెరువులను రియల్ వ్యాపారులు ఆక్రమించారన్నారు. నాలాలపై పెద్ద భవనాలు నిర్మించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నాలాలను రీసర్వే చేయాలని డిమాండ్ చేశారు. వరదలకు మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ. 20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు టి.శ్రీనివాస్ రావు, కర్రె భిక్షపతి,తోట భిక్షపతి, ఎల్లేశ్, ఆదరి శ్రీనివాస్, అనిల్,కుమార్, రవి, సంతోష్, శంకర్, ఎం.భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ తీరు.. అందితే జుట్టు లేకపోతే కాళ్లు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

హన్మకొండ: సీఎం కేసీఆర్‌ది అందితే జుట్టు.. లేకపోతే కాళ్లు పట్టుకునే తీరని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే వారిని ఎంతో అవమానించారని, మానసికంగా హింసించారన్నారు. ఉద్యోగాల నుంచి తొలగించి చివరకు వారు ఆత్మహత్యలు చేసుకునేలా చేశారన్నారు. 45 మంది ఆర్టీసీ కార్మికులు మృతి చెందారన్నారు. నాడు ప్రభుత్వంలో విలీనం చేయడం సాధ్యం కాదని, ప్రైవేట్ పరం చేయడమే పరిష్కారం అని అన్నారన్నారు. ఇప్పుడు బీఆర్‌ఎస్‌పై తీవ్ర వ్యతిరేకత పెరగడంతో ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఓట్ల కోసం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ మంత్రి వర్గంలో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారన్నారు. దీనినే అందితే జుట్టు లేకుంటే లేదంటే కాళ్లు పట్టుకునే తీరంటారన్నారు. అనాథలు ప్రభుత్వ బిడ్డలేనని చెప్పిన ప్రభుత్వం..తన మాట నిలబెట్టుకోవాలన్నారు. ఈ మేరకు సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ శాఖ మంత్రులతో మాట్లాడుతానన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్, ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్ గౌడ్, నాయకులు బుర్ర సతీష్ మాదిగ, వేల్పుల సూరన్న, శంకర్ మాదిగ మంద రాజు, సుకుమార్, జన్ను దినేష్, ఏకు శంకర్‌మాదిగ, గంగారపు శ్రీనివాస్, ప్రణయ్ దీప్, కట్ల రాజశేఖర్, అంకిల్ల రాజు మాదిగ పాల్గొన్నారు.

కేయూ పరిధిలో వివిధ పరీక్షల రీషెడ్యూల్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వాయిదాపడిన బీటెక్, బీఫార్మసీ, ఫార్మ్‌డీ పరీక్షలను మంగళవారం పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి,అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక రీషెడ్యూల్ చేశారు. గత నెల 26, 27, 28, 31, ఆగస్టు , 2,3 తేదీల్లో వాయిదా పడిన పరీక్షలకు మళ్లీ రీషెడ్యూల్ చేశారు. బీఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 4న, 7న, బీఫార్మసీ ఏడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 5న, 8న నిర్వహించనున్నామని తెలిపారు. ఫార్మ్‌డీ మూడో సంవత్సరం పరీక్షలు ఈనెల 14న, 17న, ఫార్మ్‌డీ నాలుగో సంవత్సరం పరీక్షలు 11, 16,18 తేదీల్లో నిర్వహిస్తారు. ఫార్మ్ డీ ఐదవ సంవత్సరం పరీక్షలు ఈనెల 12న నిర్వహిస్తారు.

వాయిదాపడిన బీటెక్ నాన్ సీబీసీఎస్ పరీక్షలు రీషెడ్యూల్..

కేయూ పరిధిలో బీటెక్‌నాన్ సీబీసీఎస్ పరీక్షల రీషెడ్యూల్ చేశారు. బీటెక్ నాలుగో సంవత్సరం 1వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 4న, బీటెక్ మొదటి సంవత్సరం పరీక్షలు 4న, బీటెక్ మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు, రెండో సెమిస్టర్ పరీక్షలు 5న, బీటెక్‌రెండో సంవత్సరం మొదటి సెమిస్టర్, రెండో సెమిస్టర్‌పరీక్షలు ఈనెల 7న నిర్వహిస్తారు. గత నెల 27న వాయిదా పడిన బీటెక్ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 8న నిర్వహిస్తారని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి,అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు. పరీక్షలరీషెడ్యూల్ వివరాలు కేయూ వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉన్నాయని వారు పేర్కొన్నారు.

డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలకు రీషెడ్యూల్..

కేయూ పరిధిలో వాయిదా పడిన డిగ్రీ కోర్సులు బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర ఆరో సెమిస్టర్ పరీక్షల్లో పలు పేపర్ల పరీక్షలను అధికారులు రీషెడ్యూల్ చేశారు. గత నెల 26న వాయిదా పడిన పేపర్ల పరీక్షలు ఆగస్టు 4న, గత నెల 27న వాయిదాపడిన వివిధ సబ్జెక్టుల పేపర్ల పరీక్షలు ఆగస్టు 5న నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి మంగళవారం తెలిపారు.

యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- ఇంటర్ విద్య డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ఇంటర్ విద్య డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి

విద్యారణ్యపురి: ఒకేషనల్ విద్యార్థుల తమ సామర్థ్యాల ఆధారంగా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ ఇంటర్ విద్య డిప్యూటీ డైరెక్టర్ మోటూరి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలో ఏర్పాటు చేసిన అప్రెంటీస్‌షిప్ మేళా కార్యక్రమానికి ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి.దివాకర్ అధ్యక్షత వహించగా లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఒకేషనల్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జీఎంఆర్ వంటి పెద్ద సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. యువత వివిధ రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకుంటే భావిభారతం స్వర్ణయుగం అవుతుందన్నారు.రీజినల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రప్రభుత్వ నైపుణ్య శిక్షణ అధికారి కె.విజయకుమార్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలో ఒకేషనల్ విద్యకు అధిక ప్రాధాన్యం కల్పించారన్నారు. అప్రెంటీస్‌షిప్ మేళా కార్యక్రమ అధ్యక్షుడు దివాకర్ మాట్లాడుతూ వృత్తి విద్య పూర్తి చేసిన విద్యార్థులు సృజనాత్మకత కలిగి ఉంటారన్నారు. తమ కళాశాల ఒకేషనల్ విద్యార్థి పంట పొలాలపై పెస్టిసైడ్స్‌ను పిచికారీ చేసే డ్రోన్ తయారు చేసి పలువురికి ఉపాధి కల్పించడం తమకెంతో గర్వకారణమన్నారు. వరంగల్ జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి కె. మాధవరావు మాట్లాడుతూ అప్రెంటీస్‌షిప్ మేళాలో పాల్గొంటున్న ప్రతీ విద్యార్థి , కంపెనీలు తప్పని సరిగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకుని నమోదు పత్రం పొందాలన్నారు. ప్రోగ్రాం కన్వీనర్, హన్మకొండ ఇంటర్ విద్య అధికారి ఏ.గోపాల్ మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు సుమారు ఇరవై కంపెనీలు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి అప్రెంటీస్‌షిప్ చేయడం వల్ల తమ వృత్తులలో నైపుణ్యం సాధించొచ్చన్నారు. ప్రభుత్వ పింగళి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.కవిత మాట్లాడుతూ విద్యార్థులు ఓపికతో అప్రెంటీస్‌షిప్ పూర్తి చేసుకుని విజయ తీరాలకు చేరాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బెడుదం శ్రీనివాస్, డాక్టర్ ఆర్. ప్రవీణ్ కుమార్, డాక్టర్ సవాసి శ్రీనివాస్, ఎం.రాజేంద్ర ప్రసాద్, పి.విజయ్ కుమార్, ఎం.సమ్మయ్య, ఎండీ. ఖాదర్ బాబా, డి. రవి.కె.రేణుక, నాగపరమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మోడ్రన్ డ్రెస్సుల్లో మహిళల భిక్షాటన

- జిల్లా కేంద్రంలో హల్‌చల్



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కొందరు గుర్తుతెలియని మహిళలు మంగళవారం మోడ్రన్ డ్రెస్సుల్లో భిక్షాటన చేశారు. జీన్స్ ప్యాంటు వేసుకుని, మేకప్ దిద్దుకుని రోడ్లపై కనిపించారు. కొంత సమయానికి ఓ చిన్నారిని తమవెంట తీసుకుని వచ్చి తాము వేరే రాష్ట్రం నుంచి వచ్చామని చెబుతూ హిందీలో ఉన్న ఓ ఉత్తరం చూపెడుతూ షాపుల వెంట తిరిగారు. రూ.50 ఇస్తే గాని అక్కడి నుంచి కదలలేదు. కొందరు డబ్బులు ఇవ్వగా మరికొందరు లేవని సమాధానం చెప్పి పంపించారు. ఈ విషయం అందరిని కలవరపరిచింది. వారిని చూస్తే భిక్షాటన చేసే వారిలా లేరని, మాయమాటలు చెప్పి దోచుకునేందుకే వీధుల్లో తిరుగుతున్నారని ప్రజలు భయపడ్డారు. సదరు మహిళలు ఎవరు.. ఇక్కడికి ఎందుకు వచ్చారు.. ఇలా భిక్షాటన చేయడం ఏంటని పలువురు ఆందోళన చెందుతున్నారు. కాగా, ప్రజలు ఆ మహిళల పట్ల అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచించారు.